సాక్షి
కర్నూలు
శుక్రవారం । 8 । డిసెంబర్ । 2023



## 1,260 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు గురువారం 1,260 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. కేసీ కాల్వకు 1,255 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.



## మల్లన్న సేవలో డిప్యూటీ సీఎం

శ్రీశైలంటెంపుల్: శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను గురువారం రాత్రి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దర్శించుకున్నారు.



## ఆయుర్వేదానికి నకిలీ చేటు!

కొందరు స్వార్థపరులు ఎలాంటి అర్హత లేకపోయినా ఆయుర్వేద వైద్యం చేస్తున్నారు. ప్రసార మాధ్యమాల్లో లభించే విజ్ఞానాన్ని కొంత తెలుసుకుని మోసం చేస్తున్నారు. 8లో▸

# రూ.830 కోట్లతో ప్రతి ఇంటికీ తాగునీరు

- గతంలో ఏ ప్రభుత్వం ఇంత మొత్తంలో నిధులివ్వలేదు
- 'నాడు–నేడు' తో ప్రభుత్వ పాఠశాలలకు కొత్త రూపు
- జగనన్న కాలనీల్లో సకల సౌకర్యాలు
- స్థాయీ సంఘ సమావేశాల్లో జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి
- హుందాగా సాగిన సమావేశాలు

కర్నూలు(అర్బన్): జలజీవన్ మిషన్ (జేజేఎం) కింద ప్రభుత్వం రూ.830 కోట్లు నిధులు కేటాయించిందని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తెలిపారు. ఈ నిధులతో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు చేసి తాగు నీరు అందిస్తామని పేర్కొన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇంత పెద్ద మొత్తంలో నిధులు కేటాయించలేదన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్‌లోని మినీ సమావేశ భవనంలో జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు జెడ్పీ చైర్మన్ అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ.. జేజేఎం పనులకు సంబంధించి టెండర్లు పూర్తి అయిన వాటిని వెంటనే ప్రారంభించాలని, మిగిలిన వాటికి టెండర్లను పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లకు సూచించారు. తుంగభద్ర దిగువ కాలువ, కేసీ కెనాల్, ఎస్‌ఆర్‌బీసీ పరిధిలో పంటలకు నీటిని అందించారని, ఇందుకు ఆయన ఇరిగేషన్ అధికారులకు కృతజ్ఞతలు చెప్పారు. ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది మిర్చి పంటను అధికంగా సాగు చేశారని, అయితే మిర్చికి కొత్త రకం తెగులు సోకిందని, దీనిని నివారించేందుకు ఆర్బీకేల ద్వారా క్రిమి సంహారక మందులను అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు.

### సమావేశాల్లో జెడ్పీ చైర్మన్ ఏమి మాట్లాడారంటే ...

➤ ఉమ్మడి కర్నూలు జిల్లాలో నిరుపయోగంగా ఉన్న షాదీఖానాలను గుర్తించాలి. వాటిని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టాలి. జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి సబీహాపర్వీన్ ఈ మేరకు చర్యలు తీసుకోవాలి.

➤ నాడు– నేడు పనుల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రభుత్వ పాఠశా లల రూపురేఖలను మార్చింది. ఆయా పాఠశాల ల్లోని టాయిలెట్లు, బెంచీలు, ఇతర అభివృద్ధి పనుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఈ మేరకు ప్రధానోపాధ్యాయులకు డీఈఓ రంగారెడ్డి ఉత్తర్వులు జారీ చేయాలి. అలాగే ప్రతి రోజూ విద్యార్థులు ప్రభుత్వం అందజేసిన యూనిఫాం, షూస్ వేసుకొని పాఠశాలలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

➤ ఉమ్మడి జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్‌లో ఉన్న పంటలకు నష్టం జరగకుండా ఇరిగేషన్ ఇంజినీర్లు కాలువల ద్వారా నీరు వృథా కాకుండా పొదుపుగా విడుదల చేయాలి.

➤ బ్యాంకుల సహకారం లేకపోతే ప్రభుత్వ సబ్సిడీ పథకాలు లబ్ధిదారులకు అందని పరిస్థితి నెలకొంటుంది. ఈ విషయంలో బ్యాంకర్లకు లీడ్ బ్యాంకు మేనేజర్ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేయాలి.

➤ జగనన్న కాలనీల్లో ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పిస్తోంది. గృహాలు నిర్మించుకునేలా ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలి. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం పేదలకు ఇంటి స్థలంతో పాటు ఇళ్లు మంజూరు చేసింది. జగనన్న కాలనీల్లో విద్యుత్, తాగునీరు, రోడ్లు తదితర మౌలిక వసతులను కల్పించింది.



స్థాయీ సంఘ సమావేశాల్లో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

హాజరైన వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు

### భూసేకరణలో రైతులకు అన్యాయం చేయొద్దు

జాతీయ రహదారుల నిర్మాణాలకు అవసరమైన భూములను సేకరించే విషయంలో రైతులను అన్యాయం చేయకుండా ధరలను నిర్ణయించాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కోరారు. ఏడవ స్థాయీ సంఘానికి సంబంధించి ఆర్ అండ్‌బీ, జాతీయ రహదారులపై జరిగిన చర్చలో ఎమ్మెల్యే కాటసాని మాట్లాడారు. కోట్ల రూపాయల విలువ చేసే భూములకు లక్షల రూపాయల ధర ఖరారు చేస్తే రైతుల కడుపు మండదా? ఏసీ గదుల్లో కూర్చొని ధరలను ఎలా నిర్ణయిస్తారని మండిపడ్డారు. ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధరలో కనీసం 50 నుంచి 60 శాతం కూడా చెల్లించకుండా ఢిల్లీలోని ఆర్‌ఓలు నిర్ణయం తీసుకుంటే రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. పూనా హైవేకు సంబంధించి పెద్దపాడు సమీపంలోని భూమిని సేకరిస్తున్నారని, ఇక్కడ ఒక ఎకరా రూ.2 కోట్లు ఉంటే కేవలం రూ.15 లక్షల నుంచి 16 లక్షలు ఇస్తామంటే ఎలా ? అని ఆయన ప్రశ్నించారు. కర్నూలు నుంచి ఆత్మకూరు వరకు జరుగుతున్న ఎన్‌హెచ్ 340సీ రహదారి పనుల్లో ఎందుకు జాప్యం జరుగుతున్నదని ప్రశ్నించారు. పాణ్యం నియోజకవర్గంలోని పలు రోడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయని, వెంటనే వాటికి మరమ్మతులు చేయాలన్నారు. ఉయ్యాలవాడ గ్రామంలోని రోడ్డు, కరిమద్దెల నుంచి బండి ఆత్మకూరు రహదారిని బాగు చేయాలన్నారు. ఆయా సమావేశాల్లో జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్ ముజాఫర్ నాయక్, సీఈఓ జీ నాసరరెడ్డి, ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈలు నాగరాజు, బీ నాగేశ్వరరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎస్ శ్రీనివాసకుమార్, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రంగలక్ష్మీదేవి, బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణి పీ వెంకటలక్షుమ్మ, డీపీఓ టీ నాగరాజునాయుడు, డీఈఓ రంగారెడ్డి, ఎస్ఎస్ఏ పీఓ వేణుగోపాల్‌తో పాటు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## న్యూస్‌రీల్

### సాయుధ దళాల సంక్షేమ నిధికి విరాళాలు



విరాళం ఇస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): సాయుధ దళాల సంక్షేమ నిధికి జేసీ నారపురెడ్డి మౌర్య, పలువురు అధికారులు గురువారం విరాళాలు ఇచ్చారు. సాయుధ పతాక దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో జేసీ మాట్లాడారు. దేశం కోసం జవానులు ప్రాణాలు సైతం అర్పిస్తారన్నారు. అలాంటి జవానుల సంక్షేమ నిధికి ప్రజలు విరాళాలు ఇవ్వాలన్నారు. అనంతరం దిశ డీఎస్పీ ఐ.సుధాకర్‌రెడ్డి, జిల్లా మాజీ సైనిక సంక్షేమాధికారి ఎస్‌ఆర్ రత్నరూత్, సిబ్బంది రఫీక్ అహ్మద్, పుష్పలత, గురుదేవి, ఇతర అధికారులు విరాళాలు ఇచ్చారు.

### ఆర్‌యూ బీఈడీ ఫలితాలు విడుదల

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో ఏప్రిల్–2023లో జరిగిన బీఈడీ 3వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.ఫజుల్ రెహమాన్ ఆదేశాల మేరకు గురువారం విడుదల చేశారు. ఫలితాలను rayalaseemauniversity.ac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వెంకటేశ్వర్లు తెలిపారు. 469 మంది విద్యార్థుల్లో 99 మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు.

### 13న డిప్లమా ఫార్మసీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

కర్నూలు కల్చరల్: కర్నూలు బి.తాండ్రపాడు ఎస్‌జీపీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమా ఇన్ ఫార్మసీ కోర్సులో ఈనెల 13న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.ఎస్.ఎస్.ఎస్.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 30 సీట్లు, ఈడబ్ల్యూఎస్ కోటాలో 6 సీట్లకు ఇంటర్మీడియట్ (ఎంపీసీ/బైపీసీ) పాసైన విద్యార్థులు డి ఫార్మసీ స్పాట్ అడ్మిషన్స్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 12వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా విద్యార్థులు విద్యార్హతలతో కూడిన బయోడేటాను అందజేయాలన్నారు. వివరాలకు 94900 84300 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

### విభజన హామీలు అమలు చేయాలి

- పార్లమెంట్‌లో ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర విభజన నేపథ్యంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ కోరారు. గురువారం ఆయన పార్లమెంట్‌లో మాట్లాడారు. ఏపీ పునర్‌వ్యవస్థీకరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం గౌరవించాలన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు కృషి చేయాలని విన్నవించారు. ఉన్నత విద్యా ప్రమాణాలు పెంచేలా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయాలను పటిష్టపరిచేందుకు తెస్తున్న సవరణ బిల్లు–2023కు మద్దతు ఇస్తున్నట్లు కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ తెలిపారు.

## సంక్షేమ బావుటా



### విద్యా దీవెన ఆదుకుంది

మా నాన్న పై వెంకటరామకృష్ణ. నెలకు రూ.15 వేల జీతంతో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు. ఇద్దరు చెల్లెళ్లు ఒకరు డిగ్రీ ఫస్ట్ ఇయర్, ఇంకొకరు ఇంటర్ సెకండ్ ఇయర్, తమ్ముడు 8వ తరగతి చదువుతున్నాడు. నలుగురిని చదివించాలంటే నాన్నకు తలకు మించిన భారమే. ఈ పరిస్థితుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న విద్యాదీవెన పథకాన్ని అమలు చేస్తుండటంతో నేను బీటెక్ ఫైనలియర్ చదువుతున్నాను. నాకు ఏడాదికి ప్రభుత్వం రూ.48 వేలు ఇస్తోంది. ప్రస్తుతం నేను ఫైనలియర్‌లో ఉండగానే క్యాంపస్ సెలెక్షన్స్‌లో ఎక్సెల్లార్ కంపెనీకి ఎంపికయ్యాను. ఏడాదికి రూ.4.50 లక్షల జీతం ఇస్తామన్నారు. నా చదువుకు, నేను ఉద్యోగంలో స్థిరపడేందుకు, కుటుంబానికి ఆర్థిక చేయూతను అందించిన ముఖ్యమంత్రి మేలును మరచిపోలేం.



– ఎల్లన్నగారి హర్షిత , బీటెక్, ఫైనలియర్

### గతంలో ఇలాంటి పథకాలు లేవు

నాకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద అమ్మాయి గతేడాది బీటెక్ పూర్తయింది. మరో అమ్మాయి బీటెక్ నాల్గో సంవత్సరం చదువుతోంది. మా అబ్బాయి 9వతరగతి చదువుతున్నాడు. మాకు ప్రభుత్వం నుంచి అమ్మఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు అందుతున్నాయి. ఎవరి ప్రమేయం లేకుండా బ్యాంక్ ఖాతాలో నగదు జమ అవుతోంది. గతంలో ఇలాంటి పథకాలు లేవు. పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవడం కష్టంగా ఉండేది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పరిస్థితిలో మార్పు వచ్చింది. పేదల చదువు బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంది. మాలాంటి వారికి ఎంతో మేలు జరిగింది.




– రమేష్, మద్దికెర

### ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈగా ఇసాన్‌బాషా

కర్నూలు(అర్బన్): గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య విభాగంలో ఇన్‌చార్జ్‌లు, డెప్యూటేషన్లు, ఎఫ్ఏసీ, అడహక్ అరేంజ్‌మెంట్లను రద్దు చేస్తూ ఈఎన్‌సీ పీ సంజీవరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే ఇప్పటి వరకు కర్నూలు ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జ్ ఎస్‌ఈగా ఉన్న కర్నూలు ఈఈ బీ నాగేశ్వరరావు స్థానంలో అనంతపురం ఎస్‌ఈ ఇషాన్‌బాషాకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే నాగేశ్వరరావుకు కర్నూలుతో పాటు ఆదోని ఈఈ బాధ్యతలను అప్పగించారు. ఆదోనిలో ఇన్‌చార్జ్ ఈఈగా విధులు నిర్వహిస్తున్న మురళీధర్‌రావును తిరిగి ఆళ్లగడ్డకు పంపారు.

## సంగమేశ్వరాలయానికి భక్తుల తాకిడి

- ఏర్పాట్లు చేస్తున్న ఆలయ నిర్వాహకులు



క్యూలైన్లు ఏర్పాటు చేసిన దృశ్యం

కొత్తపల్లి: సంగమేశ్వరాలయానికి భక్తుల తాకిడి రోజురోజుకు పెరుగుతోంది. కృష్ణాతీరంలో సప్తనదుల సంగమ ప్రాంతంలో వెలసిన పవిత్రమైన పుణ్యక్షేత్రం సంగమేశ్వరాలయం. ఈ ఆలయం 8 నెలలు కృష్ణానది జలాల్లో మునిగి కేవలం 4 నెలలు మాత్రమే బయటపడి భక్తులకు దర్శనమిస్తుంది. ఈ ఏడాది శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం తగ్గడంతో ఆలయం పూర్తిగా బయల్పడింది. అందులోనూ కార్తీక మాసం కావడంతో చివరి శని, ఆది, సోమవారాలు స్వామివార్ల దర్శనార్థం భక్తులు అధిక సంఖ్యలో రానున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ గురువారం క్యూలైన్లు, ఎగువ పుష్కరఘాట్ నుంచి ఆలయం వరకు విద్యుదీపాలను ఏర్పాటు చేయించారు.

## మహిళలు ఆత్మస్థైర్యంతో రాణించాలి

- 11 మంది మహిళలకు ఆటోలను పంపిణీ చేసిన జేసీ నారపురెడ్డి మౌర్య



ఆటోలో ప్రయాణిస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య, డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా

కర్నూలు(సెంట్రల్): మహిళలు ఆత్మస్థైర్యంతో అన్ని రంగాల్లో రాణించాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అన్నారు. గురువారం కలెక్టరేట్ ఆవరణలో సెర్ప్ ఉన్నతి మహిళా శక్తి ఆటో రిక్షా పథకంలో భాగంగా జిల్లాకు మంజూరైన 11 ఆటోలను ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చేయూతను ఇస్తోందన్నారు. డ్రైవర్లుగా రాణించే మహిళల కోసం సెర్ప్ ఉన్నతి మహిళా శక్తి ఆటో రిక్షా పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ మహిళలు ఆటో విలువలో 10 శాతం రుణాన్ని భరిస్తే 90 శాతానికి వడ్డీ లేకుండా రుణాలను బ్యాంకుల ద్వారా మంజూరు చేయిస్తున్నట్లు చెప్పారు. తీసుకున్న రుణాన్ని 48 కంతుల్లో చెల్లించేలా బ్యాంకులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. జిల్లాకు మొదటి విడతలో 9 బజాజ్ ఆటోలు, 2 అప్పే ఆటోలు మంజూరయ్యాయని, వీటి విలువ రూ. 29.40 లక్షలు ఉన్నట్లు చెప్పారు. అనంతరం ఆ రుణానికి సంబంధించిన మెగా చెక్కును జేసీ, ఆడీఆర్‌డీఏ వైకేపీ పీడీ సలీంబాషా, ఏపీడీ శ్రీధరరావు, డీపీఎం సర్సమ్మ, జిల్లా సమాఖ్య కోశాధికారి మాధవి, జిల్లా ఉన్నతి కోర్డినేటర్ కాశీశ్వరుడు ఆవిష్కరించారు. మహిళలు ఆటో నడపగా జేసీ, ఇతర అధికారులు షికారు చేశారు.

### ఎంతో మేలు



ఆటో తీసుకోవడం చాలా సంతోషంగా ఉంది. మా ఆర్థికాభివృద్ధికి చేయూత ఇస్తున్న జగనన్నకు కృతజ్ఞతలు చెబుతున్నా. ఈ ప్రభుత్వం మహిళలకు మేలు చేస్తోంది.

– కె.నిర్మల, పెద్దటేకూరు, కల్లూరు మండలం

### ఆనందంగా ఉంది



వడ్డీలేని రుణంతో ఆటో పొందడం ఆనందంగా ఉంది. క్రమంగా కంతులు కట్టుకోవడానికి ఎలాంటి ఇబ్బందులులేవు. పేదల కష్టం ఈ ప్రభుత్వం ఎంతో చేస్తోంది. మా అబ్బాయికి జగనన్న అమ్మఒడి కింద ఏటా రూ.15వేలు అందుతోంది. ఫిష్ ఆంధ్ర యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి నా భర్త సబ్సిడీ పొందారు.

– కే.బీబీ, నెరుడుప్పల, గోనెగొండ్ల మండలం

### జగనన్న మహిళా పక్షపాతి



నా భర్త చిరు వ్యాపారి. నేను స్నేహ పొదుపు గ్రూపులో సభ్యురాలుగా ఉన్నా. నా భర్తకు చేదోడుగా ఉండాలనే ఆటోను తీసుకున్నా. జగనన్న మహిళా పక్షపాతి. మహిళల కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారు.

– మంజుల, ఉల్చాల, కర్నూలు

# రోజుకు 390 పైగా ఎక్స్‌రేలు

**ఎక్స్‌రేలు ఎక్కడ ఆగిపోయాయి రామోజీ!**

- ఎక్స్‌రే తీయించుకున్న ప్రతి ఒక్కరికీ ఫిల్మ్ అందజేత
- పదేళ్లుగా మిషన్లు మూలనపడ్డాయి
- అప్పుడు కథనాలు రాయలేదేమని ప్రశ్నిస్తున్న ప్రజలు




రోగికి ఎక్స్‌రే తీస్తున్న వైద్య సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు రాయలసీమ జిల్లాలతో పాటు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి సైతం రోగులు వస్తున్నా ఎక్కడా వైద్య సేవలు ఆగడం లేదు. ఏ ఒక్కరినీ ఎక్స్‌రే తీయకుండా వెనక్కి పంపడం లేదు. కానీ ఈనాడు అధినేత రామోజీ తన పత్రికలో 'యంత్రాలు మూలకు.. కష్టాలు రోగులకు' అని రాసుకొచ్చారు. తరచి చూస్తే గత బుధవారం రోగుల రద్దీ పెరిగినా ఒక్క రోగినీ ఎక్స్‌రే మిషన్లు పనిచేయడం లేదని వెనక్కి పంపలేదు. ఆసుపత్రికి ప్రతిరోజూ 2వేల నుంచి 2,500 మంది వరకు ఓపీ రోగులకు చికిత్స అందిస్తున్నారు. ఇన్‌పేషెంట్లుగా నిత్యం వెయ్యి నుంచి 1,500 మంది వరకు చికిత్స పొందుతున్నారు. వీరందరికీ ఆసుపత్రిలోని అన్ని రకాల వైద్యపరీక్షలు ఆపకుండా నిర్వహిస్తున్నారు. ఎక్స్‌రే నుంచి అల్ట్రాసౌండ్, సీటీ స్కాన్, ఎంఆర్ఐ, అన్ని రకాల రక్త, మల, మూత్ర పరీక్షలు చేస్తున్నారు. ఇటీవల విద్యుత్ బిల్లుల వసూలు కోసం సీటీ స్కాన్, ఎంఆర్ఐ సేవలు నిలిపివేసినా ప్రైవేటు కేంద్రాల్లో ఒప్పందం చేసుకుని మరీ రోగులకు ఉచితంగా సేవలు అందించారు. ఈ కారణంగా ఆసుపత్రికి సీటీ స్కాన్, ఎంఆర్ఐ నిర్వహణ సంస్థలు బకాయిలు చెల్లించడంతో రూ.50లక్షలకు పైగా ఆసుపత్రికి నిధులు సమకూరాయి. ఈ నిధులతో ఇటీవల ఆసుపత్రికి అవసరమైన అత్యాధునిక వైద్యపరికరాలను జిల్లా కలెక్టర్ అనుమతితో కొనుగోలు చేశారు.

### ఎక్స్‌రే సేవలు ఎక్కడ ఆగిపోయాయి

ఆసుపత్రిలోని రేడియాలజీ విభాగంలో రెండు 500 ఎంఏ, మూడు 100 ఎంఏ ఎక్స్‌రే మిషన్లు పాతబడిపోయాయి. వీటి జీవితకాలం ముగిసిపోవడంతో 2015 నుంచి మూలనపెట్టారు. మరి అప్పుడు ఉన్నది తెలుగుదేశం ప్రభుత్వమే కదా. అప్పుడెందుకు రాయలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. డీడీఆర్ మిషన్ మరమ్మతుకు గురైనా ఆసుపత్రిలో పరికరాలు మరమ్మతులు చేసేలా ఒప్పందం చేసుకున్న సైరిక్స్ సంస్థ ఇందుకు సంబంధించి పర్చేజ్ ఆర్డర్ పెట్టింది. మరో రెండు రోజుల్లో ఈ మిషన్ యథావిధిగా పనిచేయనుంది. కానీ ఎక్కడా ఎక్స్‌రే తీయడం ఆగలేదు. రోగులకు ఫిల్మ్‌లు ఇవ్వడమూ ఆపలేదు. గత బుధవారం సైతం 396 ఎక్స్‌రేలు తీశారు. నవంబర్ మొత్తంగా 9,233 ఎక్స్‌రేలు తీసి ఫిల్మ్‌లు రోగుల చేతికి ఇచ్చారు.

### ఫిల్మ్‌ల కొరత లేదు.. సేవలు ఆగలేదు



ఆసుపత్రిలో ఎక్స్‌రే మిషన్లు పాతబడిపోవడంతో పదేళ్ల నుంచి మూలనపడ్డాయి. మిగిలినవి యథావిధిగా పనిచేస్తున్నాయి. కొత్తగా డయాగ్నోస్టిక్ బ్లాక్‌కు నాలుగు మిషన్లు వచ్చాయి. వాటిని ఇన్‌స్టాల్ చేస్తున్నారు. త్వరలో వీటి ద్వారా సేవలు రోగులకు అందుబాటులోకి వస్తాయి. ఎక్స్‌రే తీసిన ప్రతి ఒక్కరికీ ఫిల్మ్‌లు కూడా ఇస్తున్నాం. ఫిల్మ్‌ల కొరత లేదు.

– డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి, సూపరింటెండెంట్, జీజీహెచ్, కర్నూలు

## ఓటరు నమోదుకు అవకాశం

- 18 ఏళ్లు నిండిన వారందరూ అర్హులే
- తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తులు ఇవ్వవచ్చు
- ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చు
- ఈ నెల 9వ తేదీ వరకు గడువు

కర్నూలు(సెంట్రల్): ఓటు హక్కు నమోదుకు 18 ఏళ్లు నిండిన వారందరూ అర్హులే. ఇప్పటి వరకు ఓటరు జాబితాలో పేరు లేని వారు డిసెంబర్ 9వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవడానికి ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. అలాగే 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండే వారు కూడా ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఓటరు ముసాయిదా జాబితాలో మార్పులు, చేర్పుల కోసం కూడా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. నూతనంగా ఓటు హక్కు పొందాలనుకునే వారు స్థానిక తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తును సమర్పించవచ్చు. బూత్ లెవల్ ఆఫీసర్లకు సమర్పించినా సరిపోతుంది. ఆన్‌లైన్‌లో కూడా స్వయంగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకు WWW.NVSP.IN లేదా ఓటరు హెల్ప్‌లైన్ అనే మొబైల్ యాప్‌ను వినియోగించవచ్చు.

### ఫిర్యాదులపై విచారణ

ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 19,71,325 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 9,78,663, మహిళా ఓటర్లు 9,92,356, ఇతరులు 306 మంది ఉన్నారు. ఈ జాబితాల్లోని పేర్లపై ఎవరికైనా అనుమానం ఉంటే ఫిర్యాదు చేస్తే బూత్ స్థాయిలో అధికారులు విచారణ చేపడుతారు. సరైన ఆధారాలు చూపితేనే తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటారు. అలాగే ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేసుకోవచ్చు. నియోజకవర్గం మార్పు, పేర్లు, అడ్రస్సులు, ఫోన్ నంబర్లు, ఫొటో గుర్తింపు కార్డుల్లో మార్పులు చేసుకోవచ్చు. చనిపోయిన వారిని జాబితా నుంచి తొలగించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటారు. ఇందుకోసం కూడా డిసెంబర్ 9వ తేదీలోపు ఫిర్యాదులు, అభ్యంతరాలు, సలహాలు, సూచనలు ఇచ్చేందుకు సమయం ఉంది. తుది ఓటరుజాబితాను 2024 జనవరి 5వ తేదీన విడుదల చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

VISWASHANTHI
COLLEGE OF NURSING
PENCHIKALAPADU, KURNOOL.
B.Sc. NURSING MANAGEMENT
SEATS AVAILABLE ONLY FOR GIRLS
Eligibility Criteria (విద్యార్హతలు) : 10+2 BiPC.
Vocational with Bridge Course
AP EAMCET/ NEET APPEARED/ QUALIFIED
Contact: 73868 88546, 90521 14707



# ఆయుర్వేదానికి నకిలీ చేటు!

- అర్హత లేకున్నా వైద్యం
- ప్రజల ప్రాణాలతో చెలగాటం
- అనుమతి లేకుండా వ్యాపారం
- పట్టించుకోని అధికారులు

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో అర్హత కలిగిన, బీఏఎంఎస్ కోర్సు చేసిన ఆయుర్వేద వైద్యులు 300 మంది దాకా ఉన్నారు. వీరితో పాటు అనువంశిక ఆయుర్వేద వైద్యం చేసే పెద్దలూ గిరిజన ప్రాంతాల్లో కనిపిస్తారు. వీరే గాక మూలికా వైద్యంచేసే గిరిజనులు, కొండజాతి వారు వంశపారంపర్యంగా వచ్చిన విద్య కారణంగా వైద్యం చేస్తుంటారు. మొత్తంగా ఎలాంటి వైద్యం చేయాలన్నా అర్హత ప్రధానం. నిబంధనల ప్రకారం బ్యాచులర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్ చేసిన వారు మాత్రమే ఆయుర్వేద వైద్యం చేయాలి. మిగిలిన వారు ప్రజల నమ్మకాన్ని బట్టి వైద్యాన్ని కొనసాగిస్తున్నారు. అయితే కొందరు స్వార్థపరులు ఎలాంటి అర్హత, వంశపారంపర్య చరిత్ర, అనువంశికత లేకపోయినా ఉన్నట్లు భ్రమలు కల్పిస్తూ, ప్రచారం చేసుకుంటూ ఆయుర్వేద వైద్యం చేస్తున్నారు. ప్రసారమాధ్యమాలు, పుస్తకాల్లో లభించే విజ్ఞానాన్ని కొంత తెలుసుకుని వైద్యం చేస్తూ డబ్బును సంపాదిస్తున్నారు. రూ.100 ఖర్చుతో పోయే వ్యాధికి వేలాదిరూపాయలు వసూలు చేస్తున్నారు.

### లాడ్జిల్లో, వ్యాన్లలో, రోడ్లపై వైద్యం

ప్రాచీన ఆయుర్వేద వైద్యం మరీ చులకనగా మారింది. ఎంతగా అంటే మనం రోడ్డుపై వెళ్తుంటే మట్టిలో కూర్చుని మూలికలు వేసి నూరుతూ పలు రకాల మొండి వ్యాధులు తగ్గిస్తామంటూ ప్రచారం చేసుకుంటూ జనాన్ని నమ్మించి దర్జాగా వైద్యం చేస్తున్నారు. శ్రీశైలం, ఆత్మకూరు, మహానంది, అహోబిలం, కర్నూలు, నంద్యాల వంటి ప్రాంతాల్లో ఇలాంటి దృశ్యాలు ఎక్కువగా కనిపిస్తాయి. ఉత్తరాది నుంచి వచ్చినట్లు పేర్కొంటూ పట్టణాల్లో గుడారాలు వేసుకుని వైద్యం చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఎవరికి వారు తమకు సంబంధం లేదని ఊరుకుంటున్నారు. ఈ కారణంగా ఇలాంటి వారి సంఖ్య ఎప్పటికప్పుడు అధికమవుతోంది. దీనికితోడు మొలలు, ఫిస్టులా, ఫిషర్, వరిబీజం, ఎయిడ్స్, కామెర్లు వంటి వ్యాధులకు మందులు ఇస్తామంటూ ఏకంగా కర్నూలు, నంద్యాల, ఆదోని పట్టణాల్లోని వ్యాన్లలో, లాడ్జిల్లో మకాం వేస్తున్నారు. ఈ మేరకు కరపత్రాలు పంపిణీ చేసి మరీ వైద్యం చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. వీరికి కూడా ఎలాంటి అర్హత లేకపోయినా అడిగే వారే కరువయ్యారు.

➤ హొళగుంద మండలం గజ్జహళ్లి గ్రామానికి చెందిన షేక్షావలి ఆరేళ్ల కుమారుడికి మూర్ఛ రోగం ఉంది. గ్రామానికి కర్నూలు నుంచి నకిలీ ఆయుర్వేద వైద్యుడు రావడంతో అతన్ని కలిశాడు. వ్యాధి మందు ఇస్తానని, కొద్దిరోజుల్లోనే నయం అవుతుందని నమ్మబలకడంతో చికిత్స చేయించాడు. ఇందుకోసం రూ.20వేలు సమర్పించుకున్నాడు. అతను ఇచ్చిన మందు తిన్నా వ్యాధి తగ్గకపోగా మరింత పెరిగి ప్రాణం మీదకు వచ్చింది.

➤ కర్నూలు నగరంలోని శరీన్‌నగర్‌కు చెందిన రమీజాబి తన కూతురుకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో జొహరాపురంలోని నకిలీ ఆయుర్వేద వైద్యులు పార్వతమ్మ, సుజా, రత్నమ్మలను కలిసింది. వారిచ్చిన మందు తిన్న ఆమె కుమార్తె తీవ్ర వాంతులు అయి అస్వస్థతకు గురైంది. దీంతో స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ముగ్గురు మహిళలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

.. జిల్లాలో ఇటీవల ఈ రెండు ఘటనలు వెలుగులోకి వచ్చాయి. బయటపడని ఉదంతాలు ఎన్నో ఉన్నాయి.



### నకిలీ మందులతో ప్రాణాపాయం

సాధారణంగా అల్లోపతి వైద్యులు చాలా అరుదుగా స్టెరాయిడ్ మందును రోగులకు సూచిస్తారు. అది కూడా పరిమిత డోసులో మాత్రమే వాడి, రుగ్మత తగ్గిన తర్వాత నిలుపుదల చేయిస్తారు. డైక్లోఫెనాక్ మాత్రలను, ఇంజెక్షన్లను సైతం ఇలాగే వాడతారు. వీటిని దీర్ఘకాలం వాడితే కిడ్నీ, జీర్ణకోశవ్యాధులు వస్తాయని వారు పేర్కొంటారు. అయితే నకిలీ ఆయుర్వేద వైద్యులు మాత్రం ఈ రెండు మాత్రలను పొడి చేసి ఆయుర్వేద పొడుల్లో కలిపి కొత్తరకం మందును తయారు చేసి రోగులకు అంటగడుతున్నారు. వీటిని ఒక్కసారి వాడితే ఎలాంటి నొప్పులైనా వెంటనే తగ్గిపోతాయి. దీంతో ఈ మందు బ్రహ్మాండగా పని చేస్తోందని భ్రమపడి ప్రజలు వీటికి అలవాటుపడుతున్నారు. ఇలాంటి మందుల వల్ల దీర్ఘకాలంలో కిడ్నీలు పాడై, అల్సర్స్ వచ్చి లక్షల రూపాయలు వ్యాధిని తగ్గించుకునేందుకు ఖర్చు పెడుతున్నారు. కొన్నిసార్లు పరిస్థితి విషమించి ప్రాణం మీదకు తెచ్చుకుంటున్నారు.

### అల్లోపతి, ఆయుర్వేద మందులు కలిపి

సాధారణంగా అల్లోపతి మందులతో పోలిస్తే ఆయుర్వేద మందులు నిదానంగా పనిచేస్తాయనే అపోహ ప్రజల్లో ఉంది. దీనిని ఆసరాగా చేసుకుని త్వరగా డబ్బు సంపాదించాలనే ఆశతో నకిలీ ఆయుర్వేద వైద్యులు బయలుదేరారు. ఈ మేరకు పట్టణాల్లోని శివారు కాలనీల్లో నివాస గృహాలను అద్దెకు తీసుకుని నకిలీ మందులు తయారు చేస్తున్నారు. ఆరేళ్ల క్రితం నంద్యాల రోడ్డులోని శిల్పాసింగపూర్ టౌన్‌షిప్‌కు వెళ్లే దారిలో శ్రీనివాసులు అనే వ్యక్తి నకిలీ ఆయుర్వేద మందులు తయారు చేస్తూ పట్టుబడ్డాడు. అలాగే నాలుగేళ్ల క్రితం వీకర్‌సెక్షన్ కాలనీలో పట్టుబడ్డ జనార్దనాచారి సైతం ఇదే విధంగా నకిలీ మందులు తయారు చేసేవాడు. ఇతను పలుమార్లు అధికారులకు పట్టుబడి శిక్ష కూడా అనుభవించాడు. నొప్పి నివారణకు అల్లోపతిలో అరుదుగా వాడే స్టెరాయిడ్స్, డైక్లోఫెనాక్ మాత్రలను పొడి చేసి, వాటిని ఆయుర్వేద పొడుల్లో కలుపుతున్నారు. ఇప్పటికీ ఈ దందా చాలా చోట్ల కొనసాగుతోంది.

### నకి'లీలలు' ఇలా..

- కర్నూలు నగరంలోని వన్‌టౌన్ ప్రాంతంలోని ఓ హాస్పిటల్‌లో నొప్పి నివారణకు పొడి ఉన్న ప్యాకెట్లను విక్రయించడం గమనార్హం.
- నందికొట్కూరులో ఓ వ్యక్తి ఇస్తున్న మందులు తిని రోగులు చాలా మంది కిడ్నీలు దెబ్బతిని ఆసుపత్రికి వెళ్లారు.
- జొహరాపురంలో కొన్ని సంవత్సరాలుగా నకిలీ ఆయుర్వేద మందులు విక్రయిస్తున్నారు.
- జిల్లా పరిషత్‌కు సమీపంలో ఓ వ్యక్తి నకిలీ మందులు ఇచ్చి వేల రూపాయలు వసూలు చేస్తున్నారు.
- కర్నూలు బళ్లారి చౌరస్తా సమీపంలో ఓ నకిలీ వైద్యుడు ఎండీ ఆయుర్వేదిక్ అని బోర్డు రాసుకుని వైద్యం చేస్తున్నా అడిగే దిక్కులేదు.

### చాలా ప్రమాదకరం



నకిలీ మందులు వాడటం చాలా ప్రమాదరకం. ఆయుర్వేద వైద్య విజ్ఞానం లేని, ఔషధ విషయ పరిజ్ఞానం లేని నాటు వైద్యుల వల్ల సమాజానికి చాలా ముప్పు వాటిల్లుతోంది. సరిగ్గా శుద్ధి చేయని మందుల వల్ల ఎంతో మంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ఆయుర్వేద మందులను జాగ్రత్తగా పరిశీలించి వాడాలి. అర్హత కలిగిన వైద్యుల వద్ద మాత్రమే చికిత్స తీసుకోవాలి. ఇతర సర్టిఫికెట్లతో వైద్యం చేసేవారిని నమ్మవద్దు. రోడ్డుపై, వ్యాన్లలో విక్రయించే మందులు అస్సలు కొనవద్దు. ఇవి వాడటం ప్రాణాంతకం.

–డాక్టర్ ద్వారం ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులు, కర్నూలు

## క్లుప్తంగా

### అక్రమంగా గ్రావెల్ తరలింపు

- 2 హిటాచీలు, 4 టిప్పర్లు సీజ్



సీజ్ చేసిన హిటాచీ, టిప్పర్

కర్నూలు (న్యూటౌన్): గూడూరు మండలం చనుగొండ్ల గ్రామం దగ్గర అక్రమంగా 1,120 క్యూబిక్ మీటర్ల మేర గ్రావెల్ తవ్వి తరలించిన 2 హిటాచీలు, 4 టిప్పర్లను సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. గురువారం చనుగొండ్ల గ్రామం దగ్గర అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్నారనే సమాచారం రావడంతో ఆకస్మికంగా దాడి చేసి పరిసర ప్రాంతాన్ని పరిశీలించామన్నారు. హిటాచీలతో 1120 క్యూబిక్ మీటర్ల గ్రావెల్‌ను తవ్వి టిప్పర్లతో తరలించినట్లు నిర్ధారించామన్నారు. అక్రమంగా తవ్వకాలు జరిపిన హిటాచీ, టిప్పర్ల యజమానులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల్లో గనులశాఖ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, టెక్నికల్ అసిస్టెంట్ దిలీప్, వీఆర్‌ఓ సౌజన్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### పారని కేటుగాళ్ల కొత్త ఎత్తుగడ

కొలిమిగుండ్ల: సైబర్ నేరగాళ్లు వేసిన కొత్త ఎత్తుగడ పారలేదు. రోజుకో ఎత్తుగడలో భాగంగా గురువారం ఓ సైబర్ నేరగాడు కొలిమిగుండ్లకు చెందిన ఓ యువకునికి 9685933276 నంబర్‌తో ఫోన్ చేసి ఇంగ్లీష్‌లో మాట్లాడాడు. అర్ధరాత్రి వీడియో కాల్ చేసి వేధిస్తున్నట్లు ఓ అమ్మాయి ఫిర్యాదు చేసిందని, తమ దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయని, మూడు నెలల పాటు జైలు శిక్ష పడుతుందని బెదిరించారు. తక్షణ జరిమానా కింద రూ.3,044 చెల్లించాలని, లేకపోతే రెండు గంటల్లో పోలీసులు ఇంటి వద్దకు వస్తారని బెదిరించాడు. బాధితుడు సైబర్ నేరగాడి సంభాషణను ఫోన్‌లో రికార్డు చేసి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### బాలికపై వృద్ధుడి అత్యాచార యత్నం

గూడూరు రూరల్: కె.నాగలాపురం పోలీసుస్టేషన్ పరిధిలోని పెద్దపాడు గ్రామంలో గురువారం ఓ బాలికపై ఓ వృద్ధుడు అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. ఎస్‌ఐ సోమ్లానాయక్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బాలిక ఐదో తరగతి చదువుతోంది. పింజరి అల్లాబకాష్(65)ను బాలిక తాత అంటూ పిలిచేది. గురువారం బాలికను ఇంటికి తీసుకువెళ్లిన అల్లాబకాష్ అసభ్యకరంగా ప్రవర్తించి, అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాలిక కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారు వెళ్లి అల్లాబకాష్‌ను పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ విజయ్‌కుమార్, సీఐ కిరణ్‌కుమార్ గ్రామానికి వెళ్లి విచారణ జరిపారు. బాలికను చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోక్సో చట్టం కింద అల్లాబకాష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

### విళక్కి మహోత్సవాలు ప్రారంభం

నంద్యాల(అర్బన్): పట్టణంలోని గుడిపాటిగడ్డలో వెలసిన శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో 44వ మండలి విళక్కి మహోత్సవ వేడుకలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం గో పూజ, గంగపూజ, గణపతి పూజ జరిపించారు. తదనంతరం కలశ పూజ చేపట్టారు.

## సీజ్ చేసిన మద్యం ధ్వంసం



అక్రమ మద్యాన్ని ధ్వంసం చేస్తున్న అధికారులు

కర్నూలు: కర్నూలు, కోడుమూరు సెబ్ స్టేషన్ల పరిధిలో 323 కేసుల్లో సీజ్ చేసిన 2,303 లీటర్ల అక్రమ మద్యం, 2,824 లీటర్ల నాటుసారాను అధికారులు ధ్వంసం చేశారు. సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ సమక్షంలో జిల్లా సరిహద్దులోని ప్రత్యేక ప్రదేశంలో రోడ్డుపై పారబోసి రోలర్‌తో తొక్కించారు. దీని విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ మాట్లాడుతూ.. జిల్లా సరిహద్దులోని చెక్‌పోస్టుల్లో పనిచేస్తున్న సెబ్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. రాబోవు నూతన సంవత్సరం, పండుగలు, సాధారణ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం జిల్లాలోకి రాకుండా అరికట్టాలన్నారు. అక్రమంగా మద్యం తీసుకొస్తున్న వారిని పట్టుకుని వారిపై కేసులు నమోదు చేయాలని, పాత నేరస్తులను బైండోవర్ చేయాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సెబ్ డివిజనల్ టాస్క్‌ఫోర్స్ సీఐ రాజశేఖర్ గౌడ్, కర్నూలు సీఐ సత్యనారాయణ, కోడుమూరు సీఐ శ్యామ్ ప్రసాద్, డీటీఎఫ్ ఎస్‌ఐ స్వామినాథన్, ఎస్‌ఐలు ప్రసాదరావు, అన్వేష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## లోయలో పడిన లారీ

- క్లీనర్ మృతి.. ప్రాణాలతో బయటపడిన డ్రైవర్



మృతి చెందిన సుబ్రమణ్యం



చికిత్స పొందుతున్న డ్రైవర్ ఖాజా



లోయలో పడిన లారీ

మహానంది: నంద్యాల–గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డులో ఇనుప కడ్డీలలోడ్ లారీ అదుపుతప్పి లోయలో పడింది. ప్రమాదంలో క్లీనర్ మృతి చెందగా, డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డాడు. వివరాలు.. విజయవాడ నుంచి ఇనుప కడ్డీలతో నంద్యాలకు వస్తున్న లారీ నల్లమల ఘాట్‌లోని పురాతన దొరబావి వంతెన మలుపు వద్ద అదుపుతప్పి లోయలోకి పడింది. ప్రమాదంలో క్లీనర్ పాణ్యం బీసీ కాలనీకి చెందిన బుసిగారి సుబ్రహ్మణ్యం(36) కేబిన్‌లో ఇరుక్కొని ఊపిరాడక ప్రాణాలొదిలాడు. అదే కాలనీకి చెందిన డ్రైవర్ ఖాజా స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ఇతర వాహనాల డ్రైవర్ల ద్వారా సమాచారం తెలుసుకున్న రోడ్ సేఫ్టీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేబిన్‌లో ఇరుక్కున్న క్లీనర్ సుబ్రహ్మణ్యం మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల, గాయపడిన డ్రైవర్ ఖాజాను చికిత్స కోసం గాజులపల్లె ఆస్పత్రులకు తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

## ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీశైలంలో ప్రత్యేక ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ

శ్రీశైలం టెంపుల్: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని ఈ నెల 23న శ్రీశైల మహాక్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు తెలిపారు. గురువారం దేవస్థాన పరిపాలన భవనంలోని సమీక్షా సమావేశ మందిరంలో పలు అంశాలకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. ఈ నెల 23న ముక్కోటి ఏకాదశి, 27న శివముక్కోటి పర్వదినాన చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. కార్తీకమాసం చివరి రోజుల్లో భక్తులరద్దీకి అనుగుణంగా చేయాల్సిన ఏర్పాట్లపై ఈఓ సమీక్షించారు. జనవరి మాసంలో 12 నుంచి 18వ తేదీ వరకు ఏడు రోజుల పాటు సంక్రాంతి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయని, ఈ బ్రహ్మోత్సవ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని అన్ని విభాగాల అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల్లో జరిగే వైదిక కార్యక్రమాలు, వాహనసేవలు, గ్రామోత్సవాల నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. భోగి రోజున బోగిపండ్ల కార్యక్రమం, సంక్రాంతి రోజున మహిళలకు ముగ్గుల పోటీలు, బ్రహ్మోత్సవ కల్యాణంకు సంబంధించి శ్రీశైలం టీడీఏ అధికారుల సమన్వయంతో నిర్వహించాలని, 17న వేదశ్రవణ కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని ఆలయ విభాగాన్ని ఆదేశించారు. కార్తీకమాసం చివరి రోజుల్లో అధికసంఖ్యలో భక్తులు ఆలయాన్ని సందర్శించే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ప్లాస్టిక్ నిషేధంపై స్థానికులతో పాటు భక్తుల్లో అవగాహన కల్పించాలన్నారు. జనవరి 1వ తేదీ నుంచి క్షేత్ర పరిధిలో ప్లాస్టిక్ నిషేధాన్ని కచ్చితంగా అమలు చేస్తామన్నారు.

## ప్రొటెక్షన్ వాచర్‌పై ఎలుగుబంటి దాడి



గాయపడిన వాచర్ చెవుల వెంకటేశ్వర్లు

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని శిఖరేశ్వరం సమీపంలో ఇష్టకామేశ్వరికి వెళ్లే రహదారిలో ఫారెస్ట్ గేట్ వద్ద గురువారం సాయంత్రం విధులు నిర్వహిస్తున్న ప్రొటెక్షన్ వాచర్ చెవుల వెంకటేశ్వర్లు (26)పై ఎలుగుబంటి దాడి చేసింది. నిత్యం ఫారెస్ట్ అధికారులు ఏర్పాటు చేసిన వాహనాల ద్వారా భక్తులు అమ్మవారిని దర్శించుకుని వస్తుంటారు. సాయంత్రం గేటు మూసివేసిన తర్వాత ప్రొటెక్షన్ వాచర్‌పై ఎలుగుబంటి దాడి చేయడంతో అతని ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అక్కడే ఉన్న చెంచుగిరిజనులు శ్రీశైలం ప్రాజెక్ట్ కాలనీలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స చేయించారు. ప్రాణాపాయం ఏమి లేదని, ముఖంపై తీవ్రంగా గాయాలుకాగా.. చికిత్స చేసినట్లు డాక్టర్లు తెలిపారు.

## విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగా సహాయ పరికరాలు

- 12 నుంచి శిబిరాల నిర్వహణ

కర్నూలు(అర్బన్): జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులకు ఉచితంగా సహాయ పరికరాలను అందించేందుకు ఈ నెల 12 నుంచి చిప్పగిరి, మద్దికెర, హొళగుంద మండలాల్లో శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ సహాయ సంచాలకులు రయిస్‌ఫాతిమా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు చక్రాల సైకిల్, వీల్‌చైర్, చంకకర్రలు, బ్యాటరీతో నడిచే మూడు చక్రాల సైకిల్, శ్రవణ యంత్రం, అంధుల చేతి కర్రలను, వయోవృద్ధులకు సహాయ పరికరాల అవసరాన్ని గుర్తించేందుకు ఎంపిక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ నెల 12వ తేదీన చిప్పగిరి, 14న హొళగుంద, 16న మద్దికెర ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ శిబిరాలు ఏర్పాటవుతాయన్నారు. సహాయ పరికరాలకు అర్హులైన వారు 40 శాతానికి తక్కువ కాకుండా సదరం సర్టిఫికెట్, ఆధార్, రేషన్ కార్డు, కుల, ఆదాయ(నెలకు రూ.22,500 ) ధృవీకరణ పత్రాలు, వికలత్వం కనపడేలా మూడు ఫొటోలు, స్వావలంబన కార్డు జిరాక్స్ కాపీలను తీసుకొని శిబిరాలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

### కర్నూలు మార్కెట్ ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

| పంట | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| వేరుశెనగ | 4,729 | 7,740 |
| పొద్దుతిరుగుడు | 3,689 | 3,689 |
| ఆముదం | 4,144 | 5,309 |
| వాము | 10,110 | 10,110 |
| ఉల్లి | 765 | 3,959 |
| ఎండుమిర్చి | 3,599 | 21,919 |
| శనగలు | 3,560 | 3,560 |
| కందులు | 8,259 | 10,309 |
| మొక్కజొన్న | 1,700 | 2,109 |
| మినుములు | 9,339 | 9,429 |
| కొర్రలు | 4,000 | 4,000 |
| సోయాచిక్కుడు | 3,619 | 3,859 |

కర్నూలు మార్కెట్ యార్డు ఫోన్ : 08518–257204, 257661



## రైతుబజారు అధికారిపై బదిలీ వేటు

కర్నూలు(అగ్రికల్చర్): తీవ్ర అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కొత్తపేట రైతుబజారు ఎస్టేటు అధికారి జయమ్మను తాత్కాలికంగా బదిలీ చేశారు. రైతుబజారు ఎస్టేటు అధికారిపై ఇటీవల పలు విమర్శలు వచ్చాయి. ఈమెను భరించలేమని, ఇక్కడి నుంచి బదిలీ చేయాలని రైతుబజారులో కూరగాయలు, అల్లం, ఆకుకూరలు, ఆలుగడ్డలు అమ్ముకునే వ్యాపారులు జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వీటిపై తగిన చర్యలు తీసుకోవాలని జేసీ జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీని ఆదేశించారు. ఆరోపణలపై ఏడీఎం ప్రత్యేక విచారణ చేయించారు. అవినీతి ఆరోపణలపై ఏడీఎం రైతుబజార్ల సీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు కొత్తపేట రైతుబజార్ ఎస్టేట్ అధికారిని డెప్యుటేషన్‌పై అమీన్ అబ్బాస్‌నగర్ రైతు బజారుకు బదిలీ చేశారు. ఇక్కడ ఉన్న కళ్యాణిని కొత్తపేట రైతుబజారుకు ఎస్టేట్ అధికారిగా నియమించారు. అమీన్ అబ్బాస్‌నగర్‌లో మరోసారి ఫిర్యాదులు లేకుండా జాగ్రత్తగా పనిచేయాలని ఏడీఎం ఎస్టేట్ అధికారి జయమ్మకు సూచించారు. మార్పు రాకపోతే సీఈఓకు సరెండర్ చేస్తామని హెచ్చరించారు.

## 9న ఎస్టీయూ జిల్లా కౌన్సిల్ సమావేశం

కర్నూలు కల్చరల్: రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశం ఈనెల 9న ఉదయం 10 గంటలకు స్థానిక ఎస్టీయూ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.గోకారి, కె.జనార్దన్‌లు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్న, ఆర్థిక కార్యదర్శి ప్రసాద్, ఉపాధ్యాయ వాణి సంపాదకులు గాజుల నాగేశ్వరరావు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటారని పేర్కొన్నారు.

**శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయము**
బీరవోలు (గ్రా), రుద్రవరం (మం), నంద్యాల జిల్లా.
**e-Procurement Tender**
**NIT NO.P1/COE/1426/2023, Dt: 13-11-2023**
దేవాలయ పునఃనిర్మాణము కొరకు e-procurement ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు https://tender.apeprocurement.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు.
ఇట్లు కార్యనిర్వహణాధికారి

సాక్షి క్లాసిఫైడ్స్

**EDUCATION**
ONE SITTING : 10th, 12th, B.A, B.Com, B.Sc, M.Com, MBA, BBA, B.Tech., BCA, Veternery/Fisheries/ Dairy Science. (Eligible for Govt Jobs) Cont: ✆ : 73383 76874 [R-214]

**REAL ESTATE**
**PLOT FOR SALE**
నెలసరి కంతులతో కర్నూలు – నంద్యాల రోడ్, తిప్పాయిపల్లె దగ్గర ఓపెన్ ప్లాట్లు కలవు. & ఓర్వకల్లు MRO ఆఫీస్ దగ్గర ఓపెన్ ప్లాట్లు కలవు. సంప్రదించండి: 99638 00314 [L-781183]

**TO-LET**
Commercial Space 2000 Sq. Ft. for Clinics, Diagnostic Centre, Banks Offices, N.R.Peta, Appollo Lane, Kurnool. Cell: 79811 57709, 97030 61873 [L-781181]

**SERVICES**
వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో రుణాలు, సిబిల్ అవసరం లేదు. NPA కూడా దరఖాస్తు. డాల్ఫిన్ ఫైనాన్స్, రాజన్, సెల్: 8437824006. [W-788961]

**WANTED**
కోడుమూరు, గూడూరు ప్రాంతాలలో పని చేయుటకు అనుభవజ్ఞులైన సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ కావలెను. విద్యార్హత: డిగ్రీ, వ: 35–45, సంప్ర: పాలకుర్తి (కోడుమూరు), సాయిబాబా గుడి ప్రక్కన, EVER RENEW SOLAR COMPANY [L-781182]

Wanted qualified well Experienced Physics and Biology Teacher for 6th to 10th Classes. Vijetha Vidyalaya E.M. High School. Sreeram Nagar, C.Camp, Kurnool. Cell: 94927 17522 [L-806271]

త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K Ph: 9160900024/ 9640400073 [HA-925]

కష్టపడక్కర్లేదు కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంట చేయువారు,RMP& డ్రైవర్స్ కావలెను. జీ: 15000 - 40000/-, ఫ్రీ రూమ్+భోజనం. Hyd. Ph: 7993583999 [HA-923]

డైరెక్ట్ జాబ్ 18–50 సం॥ల మహిళలు/ పురుషులు మా కంపెనీ కొరకు, వెంటనే కావలెను. ఫ్రీ రూం + భోజనం, జీ॥ 18–30 వేల వరకు మ్యాన్ పవర్ ఏజెంట్స్ కావలెను. 8886733008/005 [HA-10839]

మేనేజర్స్/సూపర్‌వైజర్స్ కావలెను. ఆదోని మునిసిపాలిటి (Clap programme) నందు చెత్త సేకరణ ఆటోలను పర్యవేక్షించేందుకు అనుభవం గలవారు కావలెను ✆ 8977937517, 8978111397 [B-190878]

**గమనిక**
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
94909 94349
94412 10725

### ఆటో బోల్తా

- ఒకరి మృతి, ఐదుగురికి గాయాలు

ప్యాపిలి: మండల పరిధిలోని అలేబాదు సమీపంలో గురువారం ఆటో అదుపు తప్పి బోల్తా పడిన ప్రమాదంలో చంద్రప్ప (53) మృతి చెందాడు. డోన్ మండలం మల్యాల గ్రామానికి చెందిన 10 మంది బుధవారం రాత్రి సీతారామాపురం గ్రామానికి వెళ్లారు. గ్రామంలో జరుగుతున్న కాశిరెడ్డి నాయన ఆరాధనోత్సవాలు చూసుకుని గురువారం స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. అలేబాదు మలుపు వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడటంతో అందులో ఉన్న చంద్రప్పతో పాటు మరో ఐదుగురు గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన చంద్రప్పను చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. స్వల్పగాయాలైన వారు డోన్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

## ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు




దైవసందేశం వినిపిస్తున్న బ్రదర్ సతీష్‌కుమార్



క్రీస్తు జననం నాటక ప్రదర్శన

కర్నూలు (టౌన్): స్థానిక ఎస్టీబీసీ కళాశాల మైదానంలో గురువారం రాత్రి కల్వరి మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కల్వరి మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు బ్రదర్ సతీష్‌కుమార్ పాల్గొన్నారు. క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని మైదానంలో క్రీస్తు జననం గురించి దూత ప్రత్యక్షం, నక్షత్రం, పశువుల పాకలో క్రీస్తు జననం, క్రిస్మస్ ట్రీ ప్రాధాన్యతను వివరిస్తూ స్టేజ్ షో నిర్వహించారు. వేలాదిగా క్రైస్తవులు పాల్గొన్నారు. క్వయర్ గీతాలు అలరించాయి. ఈ సందర్భంగా బ్రదర్ సతీష్‌కుమార్ దైవసందేశం అందిస్తూ సకల మానవ పాప పరిహారార్థం క్రీస్తు మానవునిగా అవతరించారని చెప్పారు. క్రీస్తు బాటలో నడవాలని ఆయన పిలుపునిచ్చారు. కర్నూలు పాస్టర్ల సంఘం చీఫ్ ప్యాట్రన్ రెవరెండ్ ఆర్ఆర్‌డీ సజీవరాజు, రెవరెండ్ డాక్టర్ జార్జిరాజు, బిషప్ ఆమ్రోజ్, రెవరెండ్ జె.యెహోషువ, రెవరెండ్ పి.విలియమ్స్, కల్వరి మినిస్ట్రీస్ క్రిస్మస్ నిర్వాహకులు చిగురు వేణు, రెవరెండ్ రాబిన్ రాము పాల్గొన్నారు.

పాల్గొన్న క్రైస్తవులు

